## క్లుప్తంగా

### వణుకూరులో రూ.23 లక్షలతో అభివృద్ధి పనులు

పెనమలూరు: వణుకూరు గ్రామంలో రూ.23 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టామని గ్రామ సర్పంచి చెక్కా విజయ తెలిపారు. ఆమె గ్రామంలో బీసీ కమ్యూనిటీ హాల్ వద్ద సీసీ రోడ్డు, హిందూ శ్మశానవాటిక వద్ద సీసీ రోడ్డు, డ్రైను నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి గడప గడపకు పర్యటించిన సమయంలో స్థానికులు రోడ్లు కావాలని అభ్యర్థించారన్నారు. దీనిపై ఎమ్మెల్యే వెంటనే స్పందించి మండల పరిషత్ నిధులు మంజూరు చేయించారన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచి గద్దల రాజా, సొసైటీ అధ్యక్షుడు వేమూరి రాజా పాల్గొన్నారు.

### 197 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు

ఉయ్యూరు: దృష్టి లోపాలను నిర్లక్ష్యం చేయొద్దని ఆప్తాలమిక్ ఆఫీసర్ వి.వి.రాజేష్‌కుమార్ అన్నారు. ఉయ్యూరు మున్సిపాలిటీ పరిధిలోని జెడ్పీ పాఠశాలలో 197 మంది విద్యార్థులకు మంగళవారం కంటి పరీక్షలు నిర్వహించారు. ఆప్తాలమిక్ ఆఫీసర్ రాజేష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో దృష్టి లోపాలు ఉన్న చిన్నారులను గుర్తించి ఉచితంగా కళ్లజోళ్లు అందిస్తున్నామన్నారు. కంటి సమస్యలను ప్రాథమికంగా గుర్తించి వైద్యం పొందాలన్నారు.

### పింఛన్ సొమ్ము విడుదల

పెనమలూరు: పెనమలూరు మండలం, తాడిగడప మున్సిపాలిటీలో లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము విడుదల చేశామని ఎంపీడీఓ సునితాశర్మ తెలిపారు. ఆమె మంగళవారం వివరాలు తెలుపుతూ పెనమలూరు, తాడిగడపలో మొత్తం పింఛన్ లబ్ధిదారులు 17,962 మంది ఉన్నారన్నారు. వీరికి ప్రభుత్వం రూ.4,99,92,250 నిధులు మంజూరు చేసి విడుదల చేసిందన్నారు. పెనమలూరు మండలంలో 5570 మందికి 1,53,80,750, తాడిగడపలో 12,392 మందికి రూ.3,46,11,500 చొప్పున కేటాయించారన్నారు. మార్చి ఒకటో తేదీన అన్ని గ్రామాల్లో పింఛన్ లబ్ధిదారుల ఇంటికి వలంటీర్లు, సచివాలయ సిబ్బంది వచ్చి పింఛన్ సొమ్ము పంపిణీ చేస్తారన్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలకు గాయాలు

పెనమలూరు: పోరంకి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలకు గాయాలవటంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం ప్రకారం పోరంకి పరిధిలో విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై బి.పద్మావతి, ఎస్.విజయలక్ష్మి అనే ఇద్దరు మహిళలు రోడ్డు దాటుతుండగా వారిని కంకిపాడు వైపు వెళుతున్న బైక్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో వారిద్దరికి గాయాలయ్యాయి. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

### యనమలకుదురులో ఘర్షణ

పెనమలూరు: యనమలకుదురులో ఘర్షణ జరగటంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం ప్రకారం యనమలకుదురు లంబాడీపేటకు చెందిన మూడావత్‌జగన్‌కు హైదరాబాద్‌లో ఉంటున్న వరుసకు సోదరుడు మూడావత్ కృష్ణకు కుటుంబ తగాదాలు తలెత్తాయి. దీంతో జగన్‌పై కృష్ణ, అతని మిత్రుడు శ్రీను దాడి చేశారు. అయితే తనపైనే జగన్ దాడి చేశాడని కృష్ణ ఫిర్యాదు చేశారు. పరస్పరం ఫిర్యాదులు చేసుకోవటంతో పోలీసులు రెండు వైపులా కేసులు నమోదు చేశారు.

### టైలర్ల సంక్షేమానికి చర్యలు

కంకిపాడు: టైలర్ల సంక్షేమానికి కృషి చేస్తామని జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు అన్నారు. టైలర్స్ డే వేడుకలు మంగళవారం కంకిపాడులోని కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య ప్రార్థనా మందిరంలో నిర్వహించారు. కంకిపాడు గార్మెంట్స్ మాన్యుఫ్యాక్చరింగ్ టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వేడుకల్లో జెడ్పీటీసీ బాకీ బాబు మాట్లాడుతూ కమ్యూనిటీహాలు నిర్మాణానికి స్థలం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

### ఆయిల్ పామ్ రైతులకు అవగాహన సదస్సు

గన్నవరంరూరల్: మండలంలోని తెంపల్లిలో మంగళవారం ఆయిల్ పామ్ సాగు రైతులకు ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. మండల ఇన్‌చార్జి హార్టీకల్చర్ అధికారి ఇ.హరిచంద్ పాల్గొని ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా ఆయిల్ పామ్ సాగుదారులకు రాయితీలు అందజేస్తుందని, వినియోగించుకోవాలని సూచించారు. ఈ సాగు లాభదాయకంగా ఉంటుందన్నారు. నిరంతరం సస్య రక్షణ, యాజమాన్య పద్ధతులను ఉద్యాన శాఖ రైతులకు సూచిస్తుందని, సేవలు వినియోగించుకోవాలని చెప్పారు.

### బాలల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

గన్నవరంరూరల్: మండలంలోని తెంపల్లిలో మంగళవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలల బాలల ఎత్తుకు తగ్గ బరువులను నమోదు చేశారు. ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తూ బాలలను ఆరోగ్యవంతులుగా తయారు చేసే కృషిని కొనసాగిస్తుందని ఏఎన్‌ఎం మంజుల చెప్పారు. బాలలు, విద్యార్థులు వారి ఎత్తుకు తగ్గ బరువులతో ఆరోగ్యంగా ఉండాలని, దీని కోసం వివరాలను నమోదు చేస్తున్నట్లు వివరించారు. ఎస్‌ఎల్‌హెచ్‌పీ అంకమ్మ, ఆశ కార్యకర్తలు దుర్గమ్మ, మేరీ పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమం అందేలా చూడాలి

రామవరప్పాడు: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రధాన ధ్యేయమని గౌడ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్, కైకలూరు నియోజకవర్గ పరిశీలకుడు మాదు శివరామకృష్ణ అన్నారు. విజయవాడరూరల్ మండలం ఎనికేపాడు బీవీఆర్ కల్యాణ మండపంలో మంగళవారం మండల స్థాయిలో వలంటీర్లు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శివరామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సిద్ధాంతాలను ఇంటింటికీ ప్రచారం చేయడానికి వలంటీర్లు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు కృషి చేయాలన్నారు. జగనన్న ప్రభుత్వంపై ఎల్లోమీడియా చేస్తున్న విష ప్రచారాలను తిప్పి కొట్టాలని పిలుపు నిచ్చారు. గొల్లపూడి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గృహ సారథులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది అంకిత భావంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో భాగంగా గృహసారథులకు బ్యాడ్జిలు, కరపత్రాలు,



సమావేశంలో మాట్లాడుతున్న గౌడ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మాదు శివరామకృష్ణ

పెన్నులు, మొబైల్ స్టిక్కర్లు, ప్రజా మద్దతు పుస్తకాలు, డోర్ స్టిక్కర్లతో కూడిన కిట్లను బ్యాగుల రూపంలో అందజేస్తారని తెలిపారు. ప్రతి నెలా 18 నుంచి 25 వరకు గృహసారథులు తమ పరిధిలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు, సిద్ధాంతాలను వివరించాలన్నారు. ఏమైనా కారణాలతో పథకాలు అందని వారుంటే గుర్తించి ఉన్నతాధికారుల చొరవతో పరిష్కారానికి కృషి చేయాలన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరల ముఖ్యమంత్రిగా గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ కాకర్లమూడి సువర్ణరాజు, గన్నవరం మార్కెట్ యార్డ్ చైర్మన్ రామిశెట్టి అంజనీకుమారి, నిడమానూరు సర్పంచ్ శీలం రంగారావు, రామవరప్పాడు సర్పంచ్ వరి శ్రీదేవి, మాజీ ఎంపీపీ యర్కారెడ్డి నాగిరెడ్డి, రామవరప్పాడు కన్వీనర్ సమ్మెట సాంబశివరావు, ఎనికేపాడు కన్వీనర్ మాదు సుబ్బారావు, రామవరప్పాడు సొసైటీ చైర్మన్ సాదం వెంకటేశ్వరరావు పలు గ్రామాల ఎంపీటీసీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# నూతన ఆవిష్కరణలు చేయాలి

ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ దేవానందరెడ్డి

పెనమలూరు: విద్యార్థులు సంకల్ప బలంతో శాస్త్రవేత్తలుగా ఎదగాలని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ దేవానందరెడ్డి అన్నారు. తాడిగడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనను ఆయన పరిశీలించిన అనంతరం ప్రసంగించారు. విద్యార్థులు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. పాఠశాల స్థాయి నుంచే నూతన ఆవిష్కరణలు చేయాలని సూచించారు. పేద విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని వివరించారు. విద్యార్థులు కూడా తమకు ఉన్న అవకాశాలను పూర్తిగా సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎస్.ప్రకాశరావు మాట్లాడుతూ ప్రభుత్వ



తాడిగడపలో వైజ్ఞానిక ప్రదర్శనను పరిశీలిస్తున్న దేవానందరెడ్డి

పాఠశాలలో విద్యార్థులు ఇన్ని ప్రదర్శనలు ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సిద్ధార్థ బీఈడీ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.శేషశ్రీ, ఎన్ఆర్ఐ నవీన్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ బాబూరావు, హెచ్‌ఎం ఎస్.కనకదుర్గ, సైన్స్ ఉపాధ్యాయులు మాగంటి శ్రీనివాసరావు, ఎస్.శాంతిశ్రీ, కె.కుసుమజ్యోతి, విశ్రాంత పీడీ క్రిస్టోఫర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భవనంపై హోర్డింగ్ తొలగింపు



సాక్షి ఎఫెక్ట్

పెనమలూరు: సాక్షి'లో మంగళవారం ప్రచురించిన ప్రభుత్వ భవనంపై రాజకీయ పార్టీ హోర్డింగ్ వార్తపై మున్సిపాలిటీ అధికారులు స్పందించారు. యనమలకుదురులో ప్రభుత్వ భవనంపై ఏర్పాటు చేసిన లోకేష్ యువగళం హోర్డింగ్‌ను తొలగించారు.

# నర్సింగ్ విద్యార్థినికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

హనుమాన్‌జంక్షన్ రూరల్/గన్నవరం: ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఇతోధికంగా ఆర్థికసాయం అందిస్తున్న గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ సేవాదృక్పథం అభినందనీయమని పెరికీడు సర్పంచ్ పల్లపోతు జాన్ ప్రకాష్, మాజీ సర్పంచ్ తవ్వా హేమేశ్వర నరసింహమూర్తి అన్నారు. బాపులపాడు మండలం పెరికీడుకు చెందిన బీఎస్సీ నర్సింగ్ విద్యార్థిని ప్రత్తిపాటి ఇందు అనే విద్యార్థినికి రూ.20 వేలు ఆర్థికసాయాన్ని ఎమ్మెల్యే వంశీ అందించారు. చిన్నవుటపల్లిలోని డాక్టర్ సి.శోభనాద్రి సిద్ధార్థ నర్సింగ్ కాలేజీలో బీఎస్సీ మూడవ సంవత్సరం చదువుతున్న ఇందుకు కళాశాల ఫీజు చెల్లించేందుకు ఆర్థికంగా ఇబ్బందులు ఎదురుకావటంతో ఇటీవల ఎమ్మెల్యే వంశీని ఆశ్రయించారు. దీంతో తక్షణమే స్పందించిన ఆయన రూ.20 వేలు ఆర్థికసాయాన్ని అందించారు. అంతేకాక భవిష్యత్‌లోనూ ఉన్నత చదువులకు తన ప్రోత్సాహం ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ మొత్తాన్ని మంగళవారం ఆయన కార్యాలయంలో పెరికీడు సర్పంచ్ పల్లపోతు జాన్ ప్రకాష్, మాజీ సర్పంచ్ తవ్వా హేమేశ్వర నరసింహమూర్తి చేతుల మీదుగా పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు గొంది పరంధామయ్య, పండు నాగార్జున, నక్కా పవన్‌కుమార్, మెరుగుమాల శ్రీనివాస్, కొత్తూరు ఫణి పాల్గొన్నారు.




ఆర్థిక సాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

## రూ.4కోట్లు పింఛన్ సొమ్ము విడుదల

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలంలోని లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.4.60 కోట్లను విడుదల చేసినట్టు ఎంపీడీఓ బి.భార్గవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 16,535 మంది లబ్ధిదారులకు బుధవారం నుంచి పింఛన్ పంపిణీ చేస్తారన్నారు. వేలిముద్రలు పడని అవ్వాతాతలకు ముఖ గుర్తింపు విధానం ద్వారా పింఛన్ పంపిణీ చేసే వీలుందన్నారు. వేలిముద్రలు వలంటీర్ల వద్ద ఉన్న యాప్‌లో సరిపోకుంటే, ఆధార్ అనుసంధానంతో లబ్ధిదారుని ముఖాన్ని సరిపోల్చుకుని పింఛన్ డబ్బులు ఇస్తారని వివరించారు.

## సంక్షిప్తం

■ **ఉయ్యూరు ఏఎంసీ చైర్మన్‌గా వల్లభనేని**



ఉయ్యూరు: ఉయ్యూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా వల్లభనేని వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. నూతన పాలకవర్గ గౌరవ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి వ్యవహరిస్తారు. చైర్మన్‌గా వల్లభనేని వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్‌గా దాసే రవికుమార్, డైరెక్టర్లుగా బిత్రా వెంకట కిరణ్మయి, మంచికంటి భార్గవి, జంగా నాంచారమ్మ, కొక్కిలిగడ్డ మరియమ్మ, కొండపల్లి ఆదిలక్ష్మి, కూనపరెడ్డి అనూష, ధరావత్ బాలి, పెనుమూడి వాణి, అబ్దుల్ సత్తార్, ఎ.సాంబశివరావు, ఊర నాగిన్, ఆరేపల్లి నాగరాజు, గ్రంధి తిరుమల వెంకటేశ్వరరావు, పెద ఓగిరాల పీఏసీఎస్ అధ్యక్షుడు,

■ **ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ**

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2022-23 సంవత్సరానికి గానూ నిర్వహించిన పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదికను మంగళవారం నిర్వహించారు. స్థానిక మహాత్మ గాంధీ నగర్‌లోని మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమానికి డ్వామా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వెంకటలక్ష్మి, ఎస్ఆర్ఈజీఎస్ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ రమణారావు, విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి హాజరయ్యారు. గతేడాది మండలంలోని 27 గ్రామాల్లో రూ.12 కోట్ల వ్యయంతో 1520 పనులు నిర్వహించినట్లు తెలిపారు. క్షేత్రస్థాయి తనిఖీల్లో పలుచోట్ల అవకతవకలను గుర్తించారు. సంబంధిత ఫీల్డ్ ఆఫీసర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని చెప్పారు.

■ **బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి**

గన్నవరం: బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఆర్. రఘు పిలుపునిచ్చారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం ప్రజా సంఘాల ఐక్య వేదిక సమావేశం నిర్వహించారు. ప్రజా సంఘాల నేతలు కళ్ళం వెంకటేశ్వరరావు, బి. శ్రీనివాసరావు, ఆజ్మీర వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

■ **అర్హులందరికీ సంక్షేమం అందేలా చూడాలి**

ఉంగుటూరు: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమాన్ని అందజేసి ప్రజల మన్ననలను పొందే విధంగా గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పని చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య అన్నారు. మండలస్థాయిలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్ల సమావేశం తేలప్రోలు రంగమ్మ పేరంటాలు కల్యాణమండపంలో మంగళవారం జరిగింది. సమావేశంలో వెంకయ్య మాట్లాడుతూ గతంలో అనేక వాగ్దానాలను చేసి ప్రజలను మోసం చేసిన చంద్రబాబు ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రభుత్వంపై అవాస్తవాలను కల్పించి చెబుతున్నారని, అటువంటి వారిని తిప్పికొట్టాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు గొసాని, ఎంపీపీ వడ్లమూడి సరోజిని, ఉప సర్పంచ్ వింత ఆదినారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి, వివిధ గ్రామాల నుంచి వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

■

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ సైన్సు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనను సమగ్ర శిక్ష జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎ.శేఖర్ బాబు ప్రారంభించారు. ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు ప్రదర్శించిన సైన్సు నమూనాలు ఆకట్టుకున్నాయి. విద్యారహెచ్‌ఎం సీహెచ్ అనిత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏఎంఓ రాంబాబు, ఎంఈఓ బి.శ్రీనివాస్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

■ **బాల్య వివాహాలు లేని సమాజాన్ని నిర్మిద్దాం**

పెనమలూరు: బాల్య వివాహాలు లేని సమాజాన్ని నిర్మిద్దామని వైఎస్సార్ కాంగ్రెస్ నాయకుడు, చోడవరం గ్రామ సర్పంచి కాకర్ల వెంకటరత్నం అన్నారు. చైల్డ్‌లైన్ 1098, ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ ఆధ్వర్యంలో మంగళవారం చోడవరం గ్రామంలో బాల్య వివాహాల నిర్మూలన, బాలలపై వేధింపులు లేని సమాజంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచి వెంకటరత్నం మాట్లాడుతూ బాలల హక్కులను రక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సమాజంలో బాలలపై దాడులు, సాంఘిక దురాచారాలను నిర్మూలించే విషయంలో అందరూ కలిసి ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి బొమ్మసాని శ్రీనివాసరావు, కోఆర్డినేటర్ ఎ.రమేష్, వై.స్వరూపారాణి, మహిళా పోలీస్ కొడాలి ప్రశాంతి, వీఆర్వో బడుగు కోటేశ్వరరావు, సచివాలయం సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పలువురు పాల్గొన్నారు.

■ **శాస్త్రీయ దృక్పథం పెంచే సైన్స్ ఎగ్జిబిషన్‌లు**

గన్నవరంరూరల్: మండలంలోని గొల్లనపల్లి జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం జరిగింది. పూర్వ విద్యార్థులు ఈ ప్రదర్శన ప్రారంభించారు. ఈ సందర్భంగా గత సంవత్సరం 10వ తరగతిలో టాపర్‌లుగా రాణించిన ఎం.పోషిత, వి.మౌనికలకు ఒక్కొక్కరికీ రూ.2500 నగదు ప్రోత్సాహకంగా అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కేఎస్ జగదీశ్వరరావు చెప్పారు. పూర్వ విద్యార్థులు భానుమతి, ఉడతా రామకృష్ణ, బీబీగూడెం మాజీ సర్పంచ్ తమ్మిశెట్టి రఘుబాబు, మురళీధర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

■ **ప్రజల వద్దకే ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు**

గన్నవరంరూరల్: ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని ముస్తాబాద పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ శివప్రసాద్ అన్నారు. మంగళవారం సూరంపల్లి-1 సచివాలయం వద్ద స్థానికులకు ఆయన వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజల వద్దకే వైద్య సేవలను తీసుకు వచ్చిందన్నారు. దీర్ఘకాల రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఎంఎల్‌హెచ్‌పీ స్వరూప, ఏఎన్‌ఎం ఆర్.లక్ష్మి, వైద్య సిబ్బంది ప్రవీణ్, స్వర్ణలత, నిర్మలాదేవి, ఉమా, పైలెట్ బి.సుబ్బారావు పాల్గొన్నారు.

■ **దరఖాస్తులు పెండింగ్ లేకుండా చూడండి**

విజయవాడరూరల్: వివిధ అవసరాల నిమిత్తం ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులు ఎప్పటి కప్పుడు క్లియర్ చేసి పెండింగ్‌లో లేకుండా చూడాలని మండల తహసీల్దారు పి.జాహ్నవి సూచించారు. తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం వీఆర్వోలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ స్పందనలో వచ్చే దరఖాస్తులు, ఏపీ సేవ, పట్టాదారు పాస్‌పుస్తకాల కోసం వచ్చే దరఖాస్తులు, ఆదాయ, కులధ్రువీకరణ పత్రాలకు సంబంధించినవి గ్రామాల నుంచి పెండింగ్‌లో లేకుండా చూడాలని అన్నారు.

■ **జంక్షన్‌లో టైలర్స్ డే**

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ప్రపంచ టైలర్స్ డేను హనుమాన్‌జంక్షన్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రధాన కూడలిలో హనుమాన్ టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్ ఆవిష్కర్త విలియం హోవే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. టైలర్స్ అసోసియేషన్ జెండాను ఎగురవేశారు. ప్రధాన రహదారుల్లో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం స్థానిక నూజివీడు రోడ్డులోని పౌల్ట్రీ ఫార్మర్స్ వెల్ఫేర్ సిండికేట్ హాల్‌లో జరిగిన సభలో అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి నరసింహారావు మాట్లాడుతూ టైలర్స్ సంక్షేమానికి అసోసియేషన్ కృషి చేస్తుందని వివరించారు. హనుమాన్ టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు అక్బర్ బాబా, ఉపాధ్యక్షుడు తాడి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పిల్లి రాంబాబు, సలహాదారుడు కొమ్మూరి సాంబశివరావు, అవనిగడ్డ దుర్గారావు, బోడి చర్ల ఆంథోని పాల్గొన్నారు.

# క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

ఆర్‌జేడీ నాగమణి

కంకిపాడు: క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలని పాఠశాల విద్య ఆర్‌జేడీ నాగమణి సూచించారు. ఈడుపుగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆమె సందర్శించారు. అన్ని తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థుల ప్రతిభ, స్థాయిని అధ్యయనం చేశారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు అందించిన ట్యాబ్‌లను పరిశీలించి విద్యార్థులు తద్వారా నేర్చుకుంటున్న అంశాలను నేరుగా విద్యార్థుల ద్వారా తెలుసుకున్నారు. అర్థం కాని పాఠ్యాంశాలను ట్యాబ్‌ల సాయంతో పునశ్చరణ చేసుకుని అభ్యసించాలన్నారు. తొమ్మిదో తరగతి విద్యార్థులకు పూర్తయిన సిలబస్, నోట్స్ తయారీ అంశాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. పరీక్షలకు నెల రోజులు సమయం ఉందని, ఒత్తిడి అధిగమించాలని సూచించారు. ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని, ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి భుజించారు. కార్యక్రమంలో ఎంఈఓ కనకమహాలక్ష్మి, పి.నరేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఈడుపుగల్లు జెడ్పీ పాఠశాలలో విద్యార్థుల ప్రతిభా పాఠవాలను పరిశీలిస్తున్న ఆర్‌జేడీ నాగమణి

# కామినేనిలో అరుదైన గుండె శస్త్రచికిత్సలు

పెనమలూరు: కామినేని ఆస్పత్రిలో అరుదైన ఎంఐసీఎస్ గుండె ఆపరేషన్లు చేశామని సీనియర్ కార్డియోథోరాసిక్ సర్జన్ డాక్టర్ విశాల్‌కాంటి తెలిపారు. పోరంకి కామినేని ఆస్పత్రిలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు తెలిపారు. పెనమలూరుకు చెందిన కేతరాజు అరుణారావు (53)కు ఎంవీఆర్ మినివిల్లీ ఇన్వేసివ్ కార్డియాక్ సర్జరీ (ఎంఐసీఎస్), ఏలూరుకు చెందిన కురుచేటి లక్ష్మినాగవెంకటేశ్వరరావు (54)కు సీఏబీసీ సర్జరీ చిన్న కోతల ద్వారా చేశామని వివరించారు. రోగులు పూర్తిగా కోలుకున్నారని చెప్పారు. ఓపెన్ హార్ట్ సర్జరీకి బదులుగా, కత్తి గాటు లేకుండా ఆపరేషన్ చేశామన్నారు. దీని వలన తక్కువ గాట్లు, ఇన్‌ఫెక్షన్ లేకుండా, తక్కువ వ్యయంతో రోగులు సాధారణ పనులు చేసుకునే విధంగా ఈ ఆపరేషన్ ఉంటుందన్నారు. సమావేశంలో కామినేని సీవోవో డాక్టర్ నవీన్, సీనియర్ కార్డియోథోరాసిక్ సర్జన్‌లు భరత్, పవన్‌కుమార్, ఎం.వి.కల్యాణ్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైద్యులు